క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి నేడు కృత్తిక పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న ధర్మకర్త దేవాల రాజు

కంచరపాలెం : కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌ సమీప రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో బుధవారం శరవణ ట్రస్ట్‌ చైర్మన్‌, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్చకులు రామకృష్ణశర్మ నేతృత్వంలో మంగళవారం పంచమి పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం జరిగే కృత్తిక పూజల్లో పాల్గొనే భక్తులు ఆలయానికి ఉదయం 8 గంటలకే చేరుకోవాలని దేవాల రాజు కోరారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా సివిల్‌ జడ్జి వెంకట శేషమ్మ

తాటిచెట్లపాలెం : జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైల్వే న్యూ కాలనీ పరిధి కేపీఎం గర్ల్స్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్‌ జడ్జి, డిస్ట్రిక్ట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ సీనియర్‌ డివిజన్‌ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ మాట్లాడుతూ అవగాహన కల్పించారు. చిన్నారులపై శారీరక నేరాలు నియంత్రణ చట్టం – 2012పై వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎ.బాలమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

సీతమ్మధార : విధులు నిమిత్తం బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై ఫోర్తుటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం ప్రాంతానికి చెందిన పెద్దాడ రామకృష్ణ (39) ఫోర్తుటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ వెనుక ఉన్న పెట్రోల్‌ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం విధులకు వెళ్లాడు. మధ్యలో భార్య వరలక్ష్మి ఫోన్‌ చేయగా బంక్‌లో ఉన్నానని, పని పూర్తికాగానే వస్తానని చెప్పాడు. మధ్యాహ్నం ఇంటికి రాకపోవడంతో ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. తిరిగి రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో బంక్‌కు వచ్చి అడగ్గా... బంక్‌ నుంచి వెళ్లిపోయాడని చెప్పడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్‌ అన్నారు. మంగళవారం అకడమిక్‌ సెనేట్‌ మందిరంలో వర్సిటీ కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌, డిప్యూటీ రిజిస్ట్రార్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పరిపాలన విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్‌ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ఆచార్య ఈఎస్‌ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్‌ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్‌ఎన్‌ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు.

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వాములను చేయండి

ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వామ్యులను చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఎం.సురేష్‌ మీనన్‌, డాక్టర్‌ ప్రసాద్‌, డాక్టర్‌ శిరీష్‌, విక్రమ్‌, సురేంద్ర, దాస్‌, త్రినాథ్‌, పట్నాయక్‌, దంతేశ్వరి ,సులోచన, జ్యోతి రమ్య పాల్గొన్నారు.

ఆకతాయిల హల్‌చల్‌





సంకురుపేటలో బ్యాటరీ అపహరించిన బైక్‌



కప్పరాడ ఉన్నత పాఠశాల సమీపంలో పార్కింగ్‌ చేసిన ఆటోల వద్ద మద్యం బాటిళ్లు



ఐటీఐ జంక్షన్‌లో పార్కింగ్‌ చేసిన వాహనాలు

కంచరపాలెం : ఐటీఐ కూడలిలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మత్తుకు బానిసలైన కొంత మంది యువకులు వీధుల్లో పార్కింగ్‌ చేసిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌, బ్యాటరీలతోపాటు చిన్న చిన్న విడి భాగాలు అపహరించి స్క్రాప్‌ దుకాణాలకు విక్రయించేస్తున్నారు. అంతటితో ఆగకుండా పాఠశాల విద్యార్థినులు, మహిళలు రాత్రి వేళ ఒంటరిగా వెళ్తే వెకిలి చేష్టలతో ఇబ్బంది పెడుతున్నారు. వ్యసనాలకు బానిసలైన యువత చెడు మార్గాన్ని ఎంచుకుని దొంగతనాలు చేస్తూ, మత్తు పదార్థాలు సేవిస్తూ రాత్రి పూట వీధుల్లో హల్‌చల్‌ చేస్తున్నారు. ముఖ్యంగా కంచరపాలెం పోలీస్‌ స్టేషన్‌ పరిధి జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం, ఐటీఐ జంక్షన్‌, ఊర్వశి కూడలి పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంకురుపేట, గణేష్‌నగర్‌, గజపతినగర్‌, సిద్ధార్థనగర్‌, సూర్యనగర్‌, కప్పరాడ హైస్కూల్‌, రవీంద్రనగర్‌, దేవేంద్రనగర్‌, శ్రీనగర్‌, రెడ్డి కంచరపాలెం, భవానీ గార్డెన్స్‌ తదితర కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్‌ చేస్తుంటారు. రాత్రి పార్కింగ్‌ చేసిన వాహనాల నుంచి కొందరు యువకులు పెట్రోల్‌, డీజిల్‌, బ్యాటరీలు అపహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల టైర్లు, స్టెఫిన్లు, వీల్‌కు ఉన్న ప్లేట్లు కూడా దొంగలిస్తున్నారని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాల పెట్రోల్‌ పైపులను కత్తిరించి అపహరించేస్తున్నారు. ఇటీవల కాలంలో పెట్రోలు దొంగల జోరు పెరిగిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీల్లో నిందితులు కనిపిస్తున్నా కంచరపాలెం పోలీసులు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ...

విలాసాలకు అలవాటుపడిన యువకులు ఏమైనా చేస్తారని స్థానిక నివాసులు భయాందోళన చెందుతున్నారు. కప్పరాడ ఉన్నత పాఠశాల, ఐటీఐ, జిల్లా ఎంప్లాయిమెంట్‌ కార్యాలయానికి వెళ్లే ప్రాంతాల్లో పార్కింగ్‌ చేసిన ఆటోల్లో మద్యపానం, ధూమపానం చేస్తూ అటుగా వెళ్లే బాలికలు, మహిళల పట్ల ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం పూట తమ పిల్లలు ట్యూషన్లు, బయటకు వెళ్లి వచ్చేంత వరకు భయాందోళనగా ఉంటుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే యువత స్థానిక యువకులతో కలిసి ఇలాంటి పనులు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా కంచరపాలెం పోలీసులు గస్తీ పెంచి, ఆకతాయిల ఆట కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

పెట్రోల్‌ దొంగతనాల జోరు



మా ప్రాంతంలో రాత్రి సమయంలో పార్కింగ్‌ చేసిన వాహనాల నుంచి ఆకతాయిలు పెట్రోలు, డీజిల్‌ అపహరించుకుపోతున్నారు. మద్యం సేవిస్తున్నట్లు కూర్చుని... వాహనాల నుంచి సామగ్రి దొంగలిస్తున్నారు. జన సంచారం లేనప్పుడు, స్థానిక నివాసులు నిద్రించే వేళలో ద్విచక్ర వాహనాల పెట్రోల్‌ పైపులను కత్తిరించి ఇంధనం తీసుకెళ్లిపోతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి.

– సూర్యానారాయణ, సంకురుపేట, ఐటీఐ జంక్షన్‌

పోలీసు అధికారులు స్పందించాలి



జీవీఎంసీ 54వ వార్డు పరిధిలోని చాలా ప్రాంతాల్లో రాత్రి పూట జరుగుతున్న దొంగతనాలపై పోలీసు అధికారులు స్పందించాలి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానిక నివాసులు ఆందోళన చెందుతున్నారు. యువత పెట్రోల్‌, డిజిల్‌ దొంగతనాలకు పాల్పడుతున్నారు. స్థానికులు ఎవరైనా చూసి ప్రశ్నిస్తే వారిపై తిరగబడుతున్నారు. కంచరపాలెం పోలీసులు మరింత గస్తీ పెంచాలి.

– రాంబాబు, సిద్ధార్థనగర్‌, ఊర్వశి కూడలి

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న సీబీసీ అదనపు డైరెక్టర్‌ జనరల్‌ రాజేందర్‌ చౌదరి

మురళీనగర్‌ : భద్రత కేవలం నిబంధన కాదని... సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ (సీబీసీ) విభాగం అదనపు డైరెక్టర్‌ జనరల్‌ రాజేందర్‌ చౌదరి అన్నారు. విశాఖపట్నం సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరంతర విద్య, భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. ప్రజల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వేవ్స్‌ – 2025 సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌ ఛాలెంజ్‌లలో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎఫ్‌ జనరల్‌ మేనేజర్‌, పరాక్రమ అవార్డు గ్రహీత డాక్టర్‌ జీపీఆర్‌ కృష్ణ భద్రతా చర్యల ప్రాముఖ్యత, నిత్య జీవితంలో పాటించాల్సిన నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ''తల్లిపేరుతో ఒక మొక్క'' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సీబీసీ సంగీత నాటక విభాగం కళాకారులు భద్రత ప్రాముఖ్యతపై తెలుగు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ పబ్లిసిటీ అధికారి శ్రీరామమూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ కె.నారాయణరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ డిమాండ్‌

సీతమ్మధార: కాంట్రాక్ట్‌ శానిటేషన్‌ వర్కర్లకు కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ డిమాండ్‌ చేశారు. ఆంధ్రప్రదేశ్‌ మెడికల్‌ కాంట్రాక్ట్‌ ఎంప్లాయిస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్‌ శానిటేషన్‌ కార్మికులు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకత్వంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినా అమలు చేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, బేసిక్‌ వేతనంతోపాటు డీఏ, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు, కుటుంబానికి మెడికల్‌ అలవెన్సులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ దృష్టికి న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కరించమని కోరుతామన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు, మన్మథరావు, మెడికల్‌ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి జేడీ నాయుడు, రాజబాబు, ప్రభుత్వ హాస్పిటల్‌ ఉద్యోగుల సంఘం నాయకులు అప్పలరాజు, గణేష్‌, రాష్ట్ర బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి పడాల రమణ, జి.వామనమూర్తి, పడాల గోవింద్‌, కాసుబాబు, ఎన్‌.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గైనిక్‌ వైద్యులు

మహారాణిపేట: గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను జాతీయ ఇమ్యూనైజేషన్‌ షెడ్యూల్‌ కార్యక్రమంలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలువురు గైనిక్‌ వైద్యులు కోరారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నగరంలో రాక్‌డేల్‌ లేఅవుట్‌లో జరిగింది. పలువురు ప్రసూతి వైద్యులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. విశాఖ ప్రసూతి స్త్రీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్‌ వై.ఎల్‌.నర్సింగరావు, డాక్టర్‌ కిరణ్మయి, డాక్టర్‌ అల్లూ నిహారిక, డాక్టర్‌ ఐ.వాణి ప్రసంగించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా



రామాటాకీస్‌ కూడలిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : ఆటో డ్రైవర్స్‌ అండ్‌ మోటార్‌ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్‌ అండ్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్‌ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ధర్నాలో భాగంగా రామటాకీస్‌ కూడలి వద్ద మంగళవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు డ్రైవర్లకు పీఎఫ్‌, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలను రద్దు చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్స్‌ మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. గతంలో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అమలు చేసినట్టుగానే వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారని, భారీగా పెంచిన థర్డ్‌ పార్టీ ఇన్సూరెన్స్‌, రోడ్‌టాక్స్‌, గ్రీన్‌ టాక్స్‌, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్‌ ప్రతినిధులు యు.శివాజీ, రావికృష్ణ, దేవుడు, ఈశ్వర్‌, ఎస్‌.అప్పలరాజు, టి.రవి పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు



అంబలం పూజలో భవానీ భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి రామూర్తిపంతులుపేటలో పైడిమాంబ ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 11న ప్రధాన ఉత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం గౌరీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మహాత్మగాంధీ కళా సమితి ప్రాంగణంలో పైడిమాంబ అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారిని అధిష్టంపజేసి ప్రత్యేక కుంకమ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. రాత్రికి భవానీ మాలధారణ భక్తులు, స్థానికులు అంబలం పూజ నిర్వహించారు. గ్రామకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

భగవద్గీత పుస్తకాలు ఉచితంగా పంపిణీ



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు, గీతా ప్రచార సమితి, కొణతాల ఫౌండేషన్‌ సభ్యులు

డాబాగార్డెన్స్‌ : గీతా ప్రచార సమితి, కొణతాల ఫౌండేషన్‌ సంయుక్తంగా గాయత్రీదేవి చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల పిల్లలకు భగవద్గీత పుస్తకాలు ఉచితంగా అందజేశారు. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కొణతాల ఫౌండేషన్‌ చైర్మన్‌ కొణతాల శ్రీనివాస్‌, పిల్లా నూకరాజు ముందుగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. 6 నుంచి 8 ఏళ్లలోపు చిన్నారులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భగవద్గీత అనేది వృద్ధాప్య దశలో కాకుండా బాల్య దశలోనే నేర్చుకోవాలని, భగవద్గీత ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఉందని, ఎన్నో భాషల్లో కూడా అందుబాటులో ఉందన్నారు. అంత గొప్ప పుస్తకం చదవడం వల్ల వ్యక్తి జీవితం ఎలా మలచుకోవాలో తెలుస్తుందన్నారు. బాల్య దశలోనే నేర్పిస్తే పిల్లలు చెడు మార్గంలో ప్రయాణించకుండా జీవితం పట్ల, సమాజం పట్ల అవగాహనతో పెరుగుతారన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.హరిత, మధు, సునీత, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చిరాజు సేవలు ప్రశంసనీయం

మహారాణిపేట: వైద్య రంగానికి డాక్టర్‌ బుచ్చిరాజు అందించిన సేవలను పలువురు వైద్యులు ప్రశంసించారు. మంగళవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్‌ కల్చరల్‌ యూత్‌ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్‌ ట్రస్ట్‌, భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్‌ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి. బుచ్చిరాజు అభినందన సభలో పలువురు వైద్యులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్‌ ఎస్‌ఎస్‌ మూర్తి, న్యూరో సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్‌ ఎన్‌ సుబ్రహ్మణ్యం, ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్‌ కే.కృష్ణకిషోర్‌, ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్‌ ఎస్‌. లక్ష్మీనారాయణ, బీజేపీ విశాఖ నగర అధ్యక్షుడు ఎంఎంఎస్‌ పరశురామరాజు తదితరులు పాల్గొని బుచ్చిరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ ఏపీ వైద్య విభాగ కన్వీనర్‌ రూపాకుల రవికుమార్‌, ప్రొఫెసర్‌ పుల్లారావు, డాక్టర్‌ శ్రీలక్ష్మి, టి.నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, చొక్కాకుల రాంబాబు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వదిలేశారు



రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వదిలేసిన కాంక్రీట్‌ పిక్క... అక్కడే నెలల తరబడి పార్కింగ్‌ చేసిన భారీ వాహనం



మెటీరియల్‌ మధ్య నిర్లక్ష్యంగా వదిలేసిన తారు మరిగించే యంత్రాలు

- కంచరపాలెం – తాటిచెట్లపాలెం మార్గంలో బీటీ సామగ్రి
- రాత్రివేళ ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు పరిధి కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్డుకు వెళ్లే మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారికి ఇరువైపులా బీటీ సామగ్రి, కంకర, తారు, భారీ యంత్రాలను కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంగా వదిలేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2024 జనవరిలో బీటీ రోడ్లు నిర్మించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్‌ అమలులోకి రావడంతో మిగిలిన కాంక్రీట్‌ పిక్క, కంకర, యంత్ర సామగ్రిని కాంట్రాక్టర్‌ అక్కడే నిర్లక్ష్యంగా వదిలేశారు. కోట్ల రూపాయల నిధులతో రోడ్లు నిర్మించినా మిగిలిన సామగ్రి వదిలేయడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కంచరపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా రైల్వే ప్రాంతం కావడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడి రహదారిలో విద్యుత్‌ స్తంభాలున్నా వాటిపై లైట్లు కనిపించవు. సాయంత్రం వేళ ఈ మార్గంలో చీకట్లు కమ్ముకుంటాయి. అటుగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి కావస్తున్నా ఇక్కడి సామగ్రి, యంత్రాల తరలింపునకు చర్యలు చేపట్టలేదు.

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఈ రహదారిలో నిర్లక్ష్యంగా వదిలేసిన సామగ్రిని ఆనుకుని భారీ వాహనాలు పార్కింగ్‌ చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా కాంక్రీట్‌ పిక్క, కంకర, తారు యంత్రాలు వదిలేయడంతో పారిశుధ్య సిబ్బంది రోడ్లు ఊడ్చడం పూర్తిగా మానేశారు. దీంతో వదిలేసిన సామగ్రి పరిసరాల్లో ఏపుగా కలుపు మొక్కలు పెరిగిపోయి, పరిసరాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన తారు, ఇతర సామగ్రితో ఇక్కడి గోతులు పూడ్చినా సరిపోతుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

8న యల్లమ్మ జాతర



డాబాగార్డెన్స్‌ : భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న యల్లమ్మ జాతర ఈ నెల 7, 8న పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 7న తొలేళ్ల ఉత్సవం, 8న జాతర జరపనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్‌ పప్పుల వీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద యల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తుల శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు. యల్లమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి పీఎల్‌ఎన్‌ రాజు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతున్నామని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌ బందోబస్త్‌ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.